కథ

# సత్యభామ

తుళ్ళూరి భారతీదేవి

**అంతరించి పోతున్న స్టేజీ నాటకాలపై చక్కని వ్యంగ్యాత్మక చిత్రణ**

రెండో కృష్ణుడింకారాలేదని వీర టెన్షన్ పడిపోతున్నాడు కాంట్రాక్టర్ ఆంజనేయులు. ఈ పెద్ద యాక్టర్లతో ఇదే చచ్చే చావొస్తుంది. అటు శ్రీకాకుళమో ఇటు అనంతపురమో డేట్లిస్తారు. అక్కడ్నించి వస్తారో రారో.... మధ్యలో వున్నారో... ఫోన్ కూడా చేయరు. డబ్బు దగ్గర మాత్రం మొఖమాటమే లేదు.... మేకప్ ముందే కట్టాలి. విసుక్కుంటున్నాడు. గొణుక్కుం టున్నాడు. టైము చూసుకుంటున్నాడు ....టెన్షన్....వీర టెన్షన్.....

"సారూ! పొద్దుననగ రమ్మంటిరి... కూకోబెడితిరి.... నేను తెచ్చి ఆడబెడితిని.. భోజనం, డీజిల్‌కి డబ్బులిస్తే రెడీ అవుతా..." అన్నాడు డ్రైవర్.

"ఉండవయ్యా బాబూ నీదో గొడవ... అసలు రావాల్సిన వాళ్ళు రాలేదేమా అని నేను చస్తుంటే... జనం రానీ రాత్రి 10 గంటలకి ఆ ఊరుచేరినా ఫరవాలేదు" కస్సుమన్నాడు కాంట్రాక్టరు తోకతొక్కిన పాములా....

'సార్ ఫోను' పెద్దగా అరిచాడు డ్రస్ కంపెనీ ఓనరు వెంకటేశం. "వస్తున్నా! హలో! ఆ నేనే....ఎవరూ....ఎక్కడిరుక్కుపోయో... వ్యాను పంపాలా....సరే...సరే పంపుతున్నా ఛస్తానా.... అంటూ ఫోను పెట్టేసి డ్రైవర్‌ని పిలిచి వ్యాను తీసుకోని తెనాలి రూట్లో ఉప్పలపాడు దగ్గర ట్రాఫిక్ జామ్ అయ్యిందంట. నా ప్రాణానికి... సత్యభామ ఇరుక్కుపోయింది. వెళ్ళిపట్టుకురా....వెళ్ళు" అంటూ ఆజ్ఞ జారీచేశాడు.

"మరి డబ్బులు....ఆయిలూ..." నసిగాడు డ్రైవరు....

"యాక్టర్‌లేకాదు... నువ్వూ నాకు మొగుడివై కూర్చున్నావయ్యా.... ఇందా తీసుకో త్వరగా వెళ్ళు....ఎక్కించుకురా....చెప్పి పంపించాడు ఆంజనేయులు. ధనరాజు వచ్చాడా వెంకటేశం? అంటూ డ్రస్‌కంపెనీ ఓనరుని అడిగాడు ఆంజనేయులు కనపడ లేదయ్యా....వచ్చినట్లులేదు... అన్నాడు నీరసంగా... డ్రస్సు పెట్టెముందే సర్దుంచాను ఆంజనేయులూ.. అన్నాడు. ఎందుకైనా మంచిదని తన తప్పులేదని చెప్పేందుకు వెంకటేశం సర్లేవయ్యా సంవత్సరానికో నాటకానికి డ్రస్సెంతసేపు సర్దాలీ... జనం రాక నే చస్తుంటే.... అబ్బబ్బబ్బ ఈ తులాభారం ఏవోకాని నన్ను తూని పారేస్తున్నారు తక్కెటలోవేసి....."

'ట్రంగ్ ట్రంగ్'

"హలో! ఆంజనేయులు నీకే ట్రంకాల్" ఫోనందించాడు వెంకటేశం.

"హలో! రాంబాబు... ఆ! అక్కడి కొస్తావా! డైరెక్టు స్టేజీ దగ్గరకే... రూటు తెల్సుగా... గురజాల నుంచీ రెండుమైళ్ళు... అట్లాగా 25 తారీఖు డేటు రాస్కుకో ఇప్పుడే బుక్‌చేశా తర్వాత మాట్లాదామా సర్లే... దగ్గరే కనెక్షను డేటు కారంపూడి సరే సరే వస్తున్నావు కదా... టాక్సీ పెట్టాలా... ఇక్కడ పెట్టిపోతా రైల్వేస్టేషన్లో...వుంటా!"

"హమ్మయ్యా" అనుకొని ఊపిరి పీల్చుకున్నాడు రెండోకృష్ణుడి ఫోను రాకతో... "ఈ నారదుడేమయ్యాడయ్యా బాబూ.... పెందరాళే ఆ వూరు చేరితే వాళ్ళకీ మనకీ తృప్తి... సరైన సమయానికి డబ్బులు వచ్చిపడతాయ్. లేకపోతే ఏదో వంకపెట్టి కొంత తెగకోస్తారు. ఈ యాక్టర్లకి అర్థంకాదు. వాళ్ళు మాత్రం హాఫ్ కిరాయి తీసుకోమంటే తీసుకోరు. ఛీఛీ...పాడువృత్తి... ఓ పెళ్ళిచేయొచ్చు...ఓ నాటకం ఆడిం చాలంటే.......అదీ పెద్ద నటీనటుల కలయికతో చాలా కష్టం వెంకటేశం" అన్నాడు ఆంజనేయులు తలపట్టుకొని.

"చిత్తం చిత్తం...ఆవార రిస్కు తీసుకోక తప్పదన్నా... ఆయాక్టర్ల మీదనేగా ఎక్కువ డిమాండ్‌చేసి వసూలు చేస్తున్నావ్" అన్నాడు చిన్నగా అదోలా చూస్తూ వెంకటేశం. "అంతేనా! ఒక యాక్టరు రాకపోతే ఎంత గందరగోళం అభిమానులు వూరు కున్నా... కాంట్రాక్టు ఇచ్చినందుకు నా బాధ ఎవరితో చెప్పుకోవాలి? కట్టేసి తన్నిన రోజులు.. హార్మనీ డ్రస్సు పెట్టెలు బిగించిన సందర్భాలు ఎన్నిలేవు" కాంట్రాక్టరు బాధలు చెప్పుకుపోతున్నాడు సంకలో హ్యాండ్ బ్యాగు...పంచె సరిచేసుకుంటూ ఆంజ నేయులు.....

"ఇంతకీ నారదుడు ఏడయ్యా?..." విసుక్కున్నాడు అటూ ఇటూ చూస్తూ....

"నేను పొద్దునే వచ్చానండీ... రాత్రి మచిలీపట్నం... మొన్న సింహాచలం ఆడి నిద్రలేదు. అందుకే పాత కర్టెను కప్పుకొని పడుకున్నా.... బయల్దేరదామా...?" అన్నాడు నారద పాత్రధారి రాములు.

"వచ్చిన వాడివి కంటికి కనిపిం చొద్దటయ్యా.... అసలే టెన్షన్‌తో చస్తుంటేనూ పదపద వేనెక్కు... అందర్నీ ఎక్కమను... ఎవరెవరు రావాలో ఒకసారి చూస్తే.... త్వరగా బయల్దేరదాం.." అంటూ హడావుడి మొదలెట్టాడు. టైం చూసు కున్నాడు. సాయంత్రం 5 గంటలు...

"వ్యానేదండీ?" ఆశ్చర్యంగా ముఖం పెట్టి నారదుడు.

"నామతివుండా...సత్యభావు ఇరుక్కు పోతేనూ పంపించా..."

"అడుగోవస్తున్నాడు" అన్నాడు రోడ్డువైపు చూస్తూ ఆంజనేయులు.

"వెంకటేశం... మేకప్‌మన్... తబలిస్టు.. హార్మోనిస్టులు రడీనా...?"

"క్లారినెట్ నబీ కూడా రడీ సార్... బయలుదేరడమే తరువాయి. టైం పాటించేది అదిగో రుక్మిణి ఒక్కతి...రారా..వ్యానెక్కు సుందరలక్ష్మి"

"నమస్కారమన్నయ్యా... నమ స్కారం" అంది ఆటో దిగుతూనే సుందర లక్ష్మి.

"ఇప్పుడేనా అక్కారావడం" అడి గింది సత్యభామ ఆప్యాయంగా.

"పేరంటానిక్కాదు...నాటకానికి పదండి వ్యానెక్కండి..."

ఆవేశంతో ఊగిపోతూ అరిచాడు

కాంట్రాక్టర్ ఆంజనేయులు. అందరూ వ్యానెక్కారు.

"జై వెంకటేశా నాట్యమండలి, గుంటూరు వారికి జై" అంటూ అరిచారందరూ ...

సమయం రాత్రి పదిగంటలు దాటింది. కాంట్రాక్టర్ ఆంజనేయులు గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి. నాటకం టైంకి చేరకపోతే అంతా లాసే. డ్రైవర్‌ని తొందరపెడుతున్నాడు. ఊరు పొలిమేరల్లోకి వచ్చేసరికి డ్రైవర్, వ్యాన్‌లోపల కూర్చున్న వారు కోపం పట్టలేకపోతున్నారు ఆంజనేయులు మీద.

టప్..తుస్...తుస్. గుంట....బురద గుంటలో కూరుకుపోయిందో టైరు.

వ్యాన్ కదలడం కష్టంసార్ ప్రయత్నం చేసి చేసి విఫలుడై చెప్పాడు డ్రైవర్.

చంపావు కదయ్యా డ్రైవరూ. పక్కనుంచి పోతే సరిపోయేది కదయ్యా కసురుకున్నాడు. ఆంజనేయులు.

అందరూ వ్యాన్ దిగి ట్రై చేశారు. లాభం లేకపోయింది. బురదమయం. అరగంట గడిచిపోయింది. జనం గోల అక్కడికి వినబడుతోంది మైకుల్లోంచి గోలగోలగా గందరగోళంగా.

అమ్మో! జనం బాగా వచ్చి చచ్చారనుకుంటా అన్నాడు నారదుడు.

నాకిదే మొదటి నాటకం. ఏందీ అంతమంది జనం వచ్చారూ అనుకుంటూ భయంతో గొణుక్కుంటున్నాడు ఒకటో కృష్ణుడు.

"ఓరి నీబండ బడ. భయపడి ఛస్తావే.జనం ఎక్కువ మంది వుంటే స్టేజీ విరగ్గొట్టాలి. చీల్చి చెండాడాలి. వన్స్‌మోర్లు మీద వన్స్‌మోర్లు కొట్టాలి" అంది రుక్మిణియమ్మ పెద్దగా నవ్వుతూ అతని గాబరా చూసి.

"నువ్వంటే అనుభవం కలదానివత్తా. నేను కొత్తకదా" అన్నాడు ఒకటో కృష్ణుడు కృపారావు.

"నర్లే ముందు స్టేజీ దగ్గరకి చేరేదెట్లాగో ఆలోచించండి. తర్వాత చించుదురుగానీ" అన్నాడు కోపం ఆపుకోలేక ఆంజనేయులు.

"మనవల్ల కాదు బాబాయ్. ఊళ్ళో కెళ్ళి మెరికల్లాంటి ఓ పదిమందిని పట్టుకొస్తే వేన్ని ఆకాశంలోకి ఎగరేస్తారు" సలహా ఇచ్చాడు నారదుడు.

"మేకపోతుడేడి. అరె సుబ్బిగాడు... వెళ్ళి ఆ పనిచేయమను" అంటూ పురమాయించాడు. "వాడు కుంటివాడు. ఎప్పటికి చేరేను" సందేహం వెలిబుచ్చాడు నారదుడు.


"తబలావాడు లేడా?"

"వాడికి టి.బి. అన్నా...అదీ అలాంటి కేసే"

"వసంతకుడు ఎప్పుడూ నేనేనా" అన్నాడు చివరికి బయలుదేరుతూ నసుగుతూ. మరో అరగంట గడిచింది, అందరూ స్టేజీ దగ్గరికి చేరేసరికి నానా కష్టాలూ పడి.

స్నానాలు చేసి భోజనాలు చేసి వచ్చారు కొందరు. మరికొందరు. కర్టెన్లు కట్టి వెళ్ళారు. భోజనాలకి. పిల్లలు మైకులో పాటలకి చిరంజీవి స్టెపులేస్తున్నారు.

అర్ధరాత్రి 12 గంటలు.



పరాబ్రహ్మ పరమేశ్వర ప్రార్థన మొదలైంది. గ్రామసర్పంచి, మునసబు, కరణాలు అందరూ ఇంకా పెద్దిరెడ్డి గారు..సూరారెడ్డి రెండో కొడుకు కుర్చీలు వేసుకోని కూర్చున్నారు స్టేజి ముందు.

"ఇప్పుడు నువ్వేరా దున్నపోతా..." ఒకటో కృష్ణుడు నిద్రలోకి జారుకున్నవాడ్ని లేపాడు.

కమిటీవారు పెద్దాక్టర్లని కడుపునిండా తిండిపెడితే గొంతుదాకా మెక్కి గుర్రుపెడుతున్నాడు.


"నేనా" అంటూ లేచి కిరీటం సవరించుకొని...ఫ్లూటు చేత్తో పట్టుకొని ఇద్దరు పట్టుకొని ఎక్కిస్తే స్టేజీ ఎక్కాడు. నిద్ర మత్తుతో ఉన్నాడు. ఒక్కసారిగా జనాన్ని చూసేసరికి నోటమాట రావడంలేదు. అనుకోకుండానే కాళ్ళు వణుకుతున్నాయి. బిత్తరచూపులు చూస్తున్నాడు.

జనం ఈలలు గోలలు..

స్టేజీ వెనక్కివచ్చి ఆంజనేయులు లోపలికి లాగాడు బలంగా...

"ఏమొచ్చిందయ్యా...! సెంటర్లు తిప్పండి అన్నావు... రిహార్సల్‌లో బాగానే పాడావు"

"కన్‌ఫ్యూజయ్యా" అన్నాడు వెర్రి



### అపార్థాలు వద్దు

ఒకప్పటి సంచలన తార రేఖ. ఇప్పుడు తీరుబడిగా వుంది. ప్రస్తుతం రెండే రెండు సినిమాల్లో ఆఫర్లు వుండటం విశేషం. 'అయినా నేను బాధపడటంలేదు' అంటుంది. 'నేను నటిగా గర్వించదగ్గ కెరీర్‌నే చవిచూశాను. నాకున్న అభిమానులు కూడా చాలా చిత్రమైన వారు. నా సినిమాలకు మాత్రమే పరిమితం కాకుండా నా ఇండిపెండెంట్ నేచర్‌ని లైక్‌చేసి నాతో స్నేహం చేసేవాళ్ళూ వున్నారు. అయితే గతంలో నేను కొన్ని పొరపాట్లు చేశాను. నిర్మాతలన్నాక సినిమా వ్యాపారం చేస్తున్నపుడు వాళ్ళ సేఫ్టీ వాళ్ళు చూసుకుంటారు. నటిగా నా మనోభావాలని వాళ్ళకి చెప్పవలసిన అవసరం వుంది. చెప్పకపోతే ఎవరికి మట్టుకు ఏం తెలుస్తుంది' అంటోంది.

చూపులు చూస్తూ.

"ఎందుకు? టైములేదు. జనం రాళ్ళువేస్తారు వెళ్ళు. గొంతువిప్పు"

"తిరుగుడు పడ్డానన్నా" అన్నాడు మళ్ళీ వణుకుతూ.

"సర్లేవయ్యా వెళ్ళు. నీకేం భయం లేదు. వెనక నేనుంటానంటూ" ముందుకి తోశాడు ఆంజనేయులు తలబాదుకుంటూ..

చేసేదిలేక స్టేజిమైకు ముందుకెళ్ళి కళ్ళుమూసుకొని పద్యం ఎత్తుకున్నాడు ఆరున్నరొక్క సుతిలో రాగం తీస్తూ...ఒకటో కృష్ణుడు.

"కుశలంబేగద ఆంజనేయులు నీకున్" అంటూ రామాంజనేయ యుద్ధంలో రాముడి పద్యం చదివాడు.

చెప్పులు...రాళ్ళు.... రెండో కృష్ణుడ్ని రమ్మని గొడవ జనం...తొక్కిసలాట.... గందరళగోళంలో చిందరవందర.....

"అస్సలు కాంట్రాక్టరేడీ.."అంటూ పెద్ది రెడ్డిగారు లోపలికి వచ్చారు. స్టేజి వెనక తడికలతో కట్టిన టెంపరరీ గ్రీన్‌రూములోకి ఆవేశంగా అనుచరవర్గంతో.

డబ్బు ముందే తీసుకున్నావ్ ...ఎక్కడ్నించి పట్టుకొచ్చావయ్యా వీళ్ళని?

"రెండో కృష్ణుడు వస్తాడు సర్. అయ్యా తమరు కూర్చోండి....మీ జనం మీరు చెబితే వింటారు" అంది వయ్యారంగా చేతులు తిప్పుతూ క్రీగంట అదోలా చూస్తూ సత్యభామ. పెద్దిరెడ్డిగారి వీక్‌నెస్ కనిపెట్టినట్లుంది.

మెలికలు తిరిగిపోయాడు పెద్దిరెడ్డి. సత్యభామ మాటలకి ఎక్కడలేని పెద్దరికం తెచ్చుకొని మైకు ముందుకెళ్ళి ఊరిజనాన్ని శాంతింపచేశాడు. లోపలికి వచ్చి సత్యభామ పక్కనచేరి వివరాలు కనుక్కోవడంలో లీనమైపోయాడు. సపర్యలు చేయడం ప్రారంభించాడు. తనమాట కంటే పమిట చెంగు మాటకు విలువెక్కువని తెలుసుకున్న ఆంజనేయులు సైలెంటైపోయాడు చూస్తూ చేసేదిలేక.

అరగంట గడిచిపోయింది. జనం మళ్ళీ చిన్నగా గోల ప్రారంభించారు.

"ఇంకేంటి ఆలస్యం....మొదలెట్టండి....నిద్ర కాస్తా పాడుచేశారు. పొద్దున్నే పొలంలో పన్లు చేసుకోవాలా వద్దా" అన్నాడో కర్రపెత్తనం కార్యకర్త. జనాన్ని ఆపలేక లోపలికివచ్చి

"రెండో కృష్ణుడు రావాలి" చెప్పాడు వసంతకుడు మేకప్ తుదిమెరుగులు దిద్దుకుంటూ.

వ్యాను కాడే....టాక్సీ ఆపుకొని కూకున్నాడేమో బాబాయ్ అన్నాడు నారదుడు గోడకానుకొని చుట్ట కాలుస్తూ పొగవదిలి నిద్రకళ్ళతో చిద్విలాసంగా.

పెద్దిరెడ్డిగారికి చెప్పి ఎడ్లబండి ఊరుబైట బురదగుంట దగ్గరికి పంపే ఏర్పాటు చేశాడు ఆంజనేయులు అతికష్టం మీద.

"రెండో కృష్ణుడు వచ్చాడు" ప్రజల్లో కలకలం...ఈలలు... గోలలు... టాక్సీలోనే వేషంతో వున్నాడు.

తీసుకొచ్చారు కృష్ణుడిని ఎడ్ల బండిలో....దిగుతూనే స్టేజీ ఎక్కాడు. అందరికీ నమస్కరించి స్టేజీ వెనక్కి ఆంజనేయులు దగ్గరికి వచ్చాడు.

"సొమ్ము సొమ్ము..."అన్నాడు చేతులెగరేస్తూ బొటనవేలు చూపుతూ...

"నోరు విప్పాలంటే తప్పదు మరి" అన్నాడు రెండో కృష్ణుడు నోరు విప్పి.

లెక్కకట్టి అణాపైసలు ఇచ్చాడు. బ్యాగులో సర్దుకొని స్టేజీ ఎక్కాడు. అతని స్పెషల్ హార్మనిస్టుని శృతి పెట్టమని చెబ్తూ....

సమయం చాలా అయినందుకు చింతిస్తూ...రెండో కృష్ణుడితో నాటకం జరుగుతుంది అని రెడ్డిగారు చెప్పాడు మైకులో..

సైలెంటై పోయింది ఆ ప్రదేశం.

మొదటి పద్యం చదవగానే వన్స్‌మోర్ ...వన్స్‌మోర్....ఈలలు, చప్పట్లు.

మళ్ళీ పాడాడు. రెండో కృష్ణుడు రమ్యుగా రాగం మార్చి.

"ఏమైనా పెద్ద యాక్టరు పెద్ద యాక్టరే..." అనుకున్నారంతా. నాటకం అయిపోయింది.

అంతా వ్యానులో కూర్చున్నారు. ఊరి చివరిదాకా వచ్చి పెద్దిరెడ్డివారి మనుషులు సాగనంపారు. భుజం తగిలిస్తూ ఏదో చెబుతూనే వుంది సత్యభామ దారి పొడుగూతా.

కారులో కాంట్రాక్టరు రెండో కృష్ణుడు, రుక్మిణి, నారదుడు ఎక్కారు. బయలుదేరారు మిగతా జనం హడావుడిగా...... వ్యానులో కూర్చుని బయలుదేరారు.

ఉదయాన్నే గుంటూరు చేరి ఎవరి దారిన వాళ్ళు తలోవైపు ఎవరి డేట్ల ప్రకారం వాళ్ళ వాళ్ళ ఊళ్లకి వెళ్ళిపోయారు. మరుసటిరోజు నాటకానికి హడావిడిగా.

చివరగా ఆంజనేయులు, మేకప్‌మేన్ పెట్టెలతో మిగిలిపోయారు.

"అన్నా! సత్యభామ కాపాడిందన్నా! లేకపోతే రాత్రి చితకబాదేవారు" అన్నాడు మేకప్‌మాన్.

"కాదురా..రెండో కృష్ణుడు..వాడు కాస్తో కూస్తో పాడి నా పరువు నిలబెట్టాడు" అన్నాడు ఆంజనేయులు.

ఇంకా డ్రస్ కంపెనీ తీయలేదు. బయట అరుగుల మీద కూర్చున్నారిద్దరూ.

రాత్రి కబుర్లు చెప్పుకుంటూ...

"అరే నాలుగు డేట్లున్నాయ్. చెప్పడం మర్చిపోయానే..."అన్నాడు

ఆంజనేయులు రెండోకృష్ణుణ్ణి మెచ్చుకుంటూ సడన్‌గా గుర్తుకు వచ్చి.

"డేట్లు చెప్పాల్సింది...రెండో కృష్ణుడికి కాదన్నా...సత్యభామకి.."

"అవును" సత్యభామ అప్పుడు గుర్తొచ్చింది ఆంజనేయులుకి.

"ఏమైంది?" ఆలోచనలో పడ్డాడు ఆంజనేయులు కాంట్రాక్టరు కాబట్టి అర్థం చేసుకున్నాడు.

"డబల్ కిరాయికోసం ఆగుంటుంది. అది దానికి మామూలేగా....పెద్దిరెడ్డి గారితో..."

"హా..సత్యభామా పొట్టతిప్పలు.... పరువు తీస్తున్నారు..." అంటూ తలపట్టుకున్నాడు కాంట్రాక్టర్ ఆంజనేయులు.

అంతలో ఆటోలో దిగింది సత్యభామ అసిస్టెంటుతో......

"నమస్కారం అన్నయ్యా!" అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ...

"అన్నయ్యా! అంటే అన్నిటికీ పనికివస్తాడనా!" గొణుక్కున్నాడు మేకప్ మాన్.

"వ్యాన్‌లో రాలేదా" అడిగాడు పైకి చూస్తూ...

"పెద్దిరెడ్డిగారు టిఫిన్ చేసి వెళ్ళమంటేనూ....ఆగి ఫస్టుబస్‌కొచ్చా..."

"నాడేట్లు చెప్పు..." అంది వయ్యారంగా డైరీ తీస్తూ...

"నాటక కళామతల్లిని బ్రతికించేది... బ్రతికిస్తున్నది నీవే తల్లీ..రాసుకో" అంటూ డేట్లు చెప్పాడు తర్వాత ఆడాల్సిన నాటకాలు..ఊరి పేర్లూ...అడ్రస్సులు.

"వస్తానయ్యా" అంటూ బస్టాండుకి బయలుదేరింది...ఆరోజు నాటకానికి మరో వూరికి సత్యభామ.

చంద్రమతి....తులసి...తార... చింతామణి...ద్రౌపది పాత్రధారిణి.

వెళ్ళే వైపు చూస్తూ ఆలోచనలో పడ్డాడు ఆంజనేయులు...అనాథగా పెరిగి... ఇంతింతై వటుడింతై అన్నట్లు పన్నెండు సంవత్సరాలకే రికార్డింగ్ డాన్సులో గజ్జెకట్టి కళామతల్లి ఒడిలోచేరి...సాంఘిక నాటకాలు... పౌరాణిక నాటకాలు ఆడి సన్మాన సత్కారాలు, ఛీత్కారాలూ పొంది ఎంత ఎత్తుకి ఎదిగిపోయింది. తను...తనువు బలిచేసుకుంటూ నాటక కళకి జీవం పోస్తున్న ఇలాంటి సోదరీమణులు చిరకాలం జీవించాలి. అంటూ మనస్సులోనే అంజలి ఘటించాడు ఆంజనేయులు. కళ్ళవెంట తనకు తెలియకుండానే కన్నీళ్ళు వచ్చాయ్... పై పంచతో తుడుచుకున్నాడు.

"బాబుగారూ!" అంటూ ఓ పద మూడేళ్ళ పిల్ల వచ్చి బావురుమంది ఆవేదనగా..

"ఏమైంది?" అన్నాడు కంగారుగా ఆంజనేయులు అర్థంకాక దగ్గరకు తీసుకుంటూ..

"బస్టాండులో అక్కని ఎవరో నలుగురు వచ్చి..."

"వచ్చి..." ఖంగారెక్కువైంది ఆంజనేయులుకి.

"కత్తులతో పొడిచి వెళ్ళిపోయారు .... రక్తపు మడుగులో పడి వుంది... మాట్లాడ్డం లేదు" అంటూ భోరున విలపిస్తూ చెప్పింది చిన్ని.

ఆటోలో బయలుదేరాడు బస్టాండుకి. అక్కడి దృశ్యం దీనాతిదీనంగా వుంది. పోలీసులు వచ్చి పంచనామా చేసి పోస్టుమార్టమ్ రిపోర్టిచ్చి వెళ్లిపోయారు. కేసు దర్యాప్తు చేస్తామంటూ. సాయంత్రం కొంతమంది కళాకారులను పోగుచేసి చందాలు వసూలు చేసి దహనసంస్కారాలు జరిపి రాజమండ్రి బయలుదేరాడు ఆంజనేయులు దేవీనవరాత్రులు...వరస నాటకాలు.

తప్పని పరిస్థితి...ముందే నాటకాలు కాంట్రాక్టు ఇచ్చినందు వలన బయల్దేరక తప్పలేదు.

* * *

చెట్లు వెనక్కి పోతున్నాయి...రైలు ముందుకు పరిగెడుతుంటే

ఆలోచనలు వెనక్కిపోసాగాయి ...గుండె బరువెక్కింది.

అన్నయ్యా అంటూ ఆప్యాయంగా పలుకరించే సత్యభామ పోయింది. నాటక లోకంలోంచి శాశ్వతంగా.

ఆమె నాటకంలో వుంటే కాంట్రాక్టరుకు దిగులులేదు. డబ్బులు ఎలాగోలా వసూలవుతాయ్ అనే ధీమా వుండేది.

చంపిందెవరో...తనకి తెలుసు...కాని చెప్పలేని మనసు.

పెద్దిరెడ్డితో పరిచయమున్నట్లే... పక్కవూరు వీరారెడ్డితోనూ పరిచయముంది సత్యభామకి. రెడ్లిద్దరికీ ఛస్తే పడదు. ముఠా తగాదాలు, పార్టీ తగాదాలు...వక్కా ఫాక్షనిస్టులు...ఈ ఇంటి మీద కాకి ఆ ఇంటి మీద వాలితే చస్తుందంతే...

కోయిలైనా...కాకిలా చచ్చింది సత్యభామ..ఇద్దరు రెడ్ల మధ్య నలిగి నశించింది.

విషయం తెలుసుకున్న వీరారెడ్డి తన మనుషులతో చంపించాడు.

తన కసి తీర్చుకున్నాడు. పోలీసు వారు మాత్రం ఇంకా దర్యాప్తు చేస్తున్నారు. తరువాత కొంతకాలానికి చిన్ని పెద్దదై... రికార్డింగు డాన్సుల్లో చిన్న చితక వేషాల్తో మరో సత్యభామగా రూపు దిద్దుకొంది. తనతో పది సంవత్సరాల తర్వాత ప్రయాణిస్తూ నిద్రపోతున్న చిన్నిని చూస్తూ కళామతల్లీ జోహార్లు అనుకొంటూ మనసులోనే నమస్కరించాడు ఆంజనేయులు. Ⓜ

**ఏమో!**

సొగసు చూడతరమా చిత్రంతో సొగసైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న గుణశేఖర్ రామాయణం, చూడాలని వుంది చిత్రాలతో యంగ్ టాలెంటెడ్‌గా పేరు తెచ్చుకున్నాడు. అయితే మనోహరం చిత్రం విషయంలో పప్పులో కాలేశాడు అనిపించింది. జగపతిబాబు హీరోగా చిత్రం ఆద్యంతమూ యాక్షన్ ఓరియంటెడ్‌గా సాగింది. మరి మనో హరం అని ఎందుకు పేరు పెట్టాడో అర్థం కాలేదు. తాజాగా చిరంజీవితో దక్షిణాఫ్రికా అడవుల్లో మృగరాజు చిత్రం షూటింగ్ చేస్తున్నాడు. జంగిల్ సినిమాతో బోల్తా కొట్టాడు రామ్‌గోపాల్‌వర్మ. మరి అలాంటి వర్మనే డిసప్పాయింట్ చేసింది జంగిల్. మృగరాజు గుణశేఖరుడ్నేం చేస్తుందో!

